## క్లుప్తంగా

### ఓటు హక్కును వినియోగించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు మహేశ్వరరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని డిగ్రీ కళాశాల అధ్యాపకుడు మహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులను నిర్ణయించేది ప్రజల ఓటేనన్నారు. ప్రలోభాలకు లొంగకుండా జాతి నిర్మాణం కోసం పాటుపడే నాయకులను ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.పద్మ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్.కె.రాజన్న పాల్గొన్నారు.

### దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

### పంట కోతలపై రైతులకు అవగాహన



మల్యాలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ బీటీఎం చక్రవర్తి

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని మల్యాల గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో గురువారం రైతులకు పంటకోతలపై ఆత్మ బీటీఎం చక్రవర్తి నాయక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని శనగ పొలాన్ని క్షేత్ర స్థాయిలో రైతులతో కలిసి సందర్శించి ఫిట్ పాల్ ట్రాప్ ప్రయోగాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ శాంతి రాజు, రైతులు పాల్గొన్నారు.

### ఎస్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా విక్రమసింహా నాయక్



మహానంది: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం గ్రామానికి చెందిన మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దుమావత్ విక్రమసింహా నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. విక్రమసింహనాయక్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. గిరిజనులకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఇస్తున్నారని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి అన్ని బంజారా కుటుంబాలను కలిసి పార్టీ గెలుపుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పార్టీలో రాష్ట్ర స్థాయి పదవి కల్పించిన సీఎం జగన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

### బీజేపీ విధానాలను వ్యతిరేకించాలి



బైక్‌ర్యాలీలో మాట్లాడుతున్న రాంనాయక్

ఆత్మకూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల పట్ల అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాంనాయక్, అధ్యక్షుడు రజాక్, ఉపాధ్యక్షుడు రణధీర్ అన్నారు. గురువారం పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని, రైతులంటే చిన్న చూపు చూడటం సమంజసం కాదన్నారు. సీఐటీయూ నాయకులు సురేంద్ర, అంబయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

### సమ్మెను జయప్రదం చేయండి

శ్రీశైలంప్రాజెక్ట్: కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టే దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని గురువారం ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక చట్టాలను ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు.

# సర్కార్ బడి.. రూపురేఖలు మారి





నాడు కొణిదేల జడ్పీ హైస్కూల్‌లో బండపరుపు ఇలా.., నేడు హైస్కూల్ ఆవరణ,



నాడు నందికుంట ఎంపీపీ స్కూల్ భవనం



నేడు అందంగా రూపుదిద్దుకున్న పాఠశాల

- నాడు-నేడుతో కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకున్న పాఠశాలలు
- విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు
- ఉత్సాహంగా బడికి వెళ్తున్న విద్యార్థులు

ఇదే కదా.. అభివృద్ధి

నందికొట్కూరు: గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరి అధ్వానంగా తయారయ్యాయి. జగనన్న ప్రభుత్వం రాకతో సర్కారు స్కూళ్లకు మంచి రోజులొచ్చాయి. పాఠశాలల రూపురేఖలు మారాయి. గతంలో శిథిలమైన భవనాలు ప్రస్తుతం సర్వాంగసుందరంగా రూపుదిద్దుకున్నాయి. కార్పొరేటు పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పించారు. దీంతో విద్యార్థులు బడికి వచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

**నాడు అగచాట్లు.. నేడు సౌకర్యాలు**

నాడు రక్షణలేని 248 ప్రభుత్వ బడులు మందుబాబులకు అడ్డగా ఉండేవి. దుర్వాసన కొట్టే మరుగుదొడ్లు, అరకొర పుస్తకాలు, రంగులు లేక వెలవెలబోతూ, కూలేందుకు సిద్ధంగా ఉన్న గోడలు, తాగునీరు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అగచాట్లు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నాడు-నేడు మొదటి విడత కింద నియోజకవర్గంలో 83 పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. మిగతా పాఠశాలల్లో రెండో విడతగా పనులు కొనసాగుతున్నాయి. రంగురంగుల బొమ్మలతో కూడిన ప్రహరీలు, ఆధునిక బెంచీలతో, రక్షిత మంచినీటి సౌకర్యం, విశాలమైన ఆట స్థలంతో పాటు ఆధునీకీకరించిన మరుగుదొడ్లతో, పచ్చని చెట్లతో, పిల్లలకు నచ్చేలా, పెద్దలు మెచ్చేలా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా రూపురేఖలు మారాయి.



తాటిపాడు ఎంపీయూపీ స్కూల్‌లో నాడు-నేడు కింద ఏర్పాటు చేసిన బెంచీలు



ప్రాతకోట జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన టాయిలెట్లు

### కార్పొరేట్‌కు మించి వసతులు



నేను బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రాధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్నాను. నాడు కూలేందుకు సిద్ధంగా ఉన్న గోడలు, చెట్ల కింద చదువులు, మరుగుదొడ్లు లేక విద్యార్థినులు పాట్లు పడేవారు. స్కూల్‌కు కాంపౌండ్ వాల్ లేక ఆకతాయిల ఆగడాలు ప్రతి రోజూ ఎదుర్కొనేవాళ్లం. ప్రభుత్వం మా పాఠశాలకు రూ. 15. 64 లక్షల నిధులు మంజూరు చేసింది. కార్పొరేట్ పాఠశాలలకు మించి మరుగుదొడ్లు, బెంచీలు, ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్‌ల వంటి వసతులతో తరగతి గదులు రూపుదిద్దుకున్నాయి. గ్రీన్ చాక్‌బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా పిల్లలకు దుమ్ము, దూళి నుంచి ఉపశమనం కలుగుతుంది. – పార్వతి, హెచ్‌ఎం, జెడ్పీ బాలికల హైస్కూల్, నందికొట్కూరు

### పాఠశాల అందంగా రూపుదిద్దుకుంది



మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా మా పాఠశాలలలో వసతులు ఏర్పాటు చేశారు. పనులు పూర్తి అవ్వడంతో మా పాఠశాల ఎంతో అందంగా, అహ్లాదకరంగా రూపుదిద్దుకుంది. గతంలో పాఠశాల ముందు ఎప్పుడూ చెత్తా చెదారం ఎక్కువగా ఉండేది. బడి చుట్టూ కాంపౌండ్ గోడ లేకపోవడంతో పశువులు, మూగజీవాలు వచ్చి బడి వాతావరణాన్ని పాడుచేసేవి. కూర్చునేందుకు సరైన బండపరుపు కూడా సరిగా లేకుండేది. మధ్యాహ్న భోజనం చేశాకా తాగునీటికోసం ఇంటికి పోయే వాళ్లం. ఇప్పుడు అన్నీ వసతులు కల్పించారు. – సందీప్‌కుమార్, 7వ తరగతి విద్యార్థి, ఎంపీయూపీ, నందికుంట

### గొప్పగా తీర్చిదిద్దారు



మా పాఠశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు..నేడు ద్వారా ప్రైవేటు పాఠశాలల కంటే గొప్పగా తీర్చిదిద్దారు. ప్రహరీగోడ, వంటగది, బెంచీలు, తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రాంగణానికి కటాంజనం ఏర్పాటు చేశారు. అదేవిధంగా గోడలపై బొమ్మల ద్వారా విద్య నేర్చుకునేందుకు ఎంతో సులభంగా ఉంది. నీటి ట్యాంకుపై పరిశుభ్రతను తెలియజేసే చిత్రాల ద్వారా మా అలవాట్లలో మార్పుచోటుచేసుకుంది. – రాకేష్, 9వ తరగతి, పాములపాడు జిల్లా పరిషత్ హైస్కూల్

### మహాకుంభాభిషేకానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఏఈఓ మల్లికార్జున రెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు జరగనున్న మహాకుంభాభిషేక మహోత్సవానికి దేవస్థానం తరుపున పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. గురువారం దేవస్థాన ఏఈఓ మల్లికార్జునరెడ్డి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని ఆయన స్వగృహంలో కలసి మహాకుంభాభిషేక ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

### పంట నష్టపరిహారం పంపిణీ



రైతులకు చెక్కు అందజేస్తున్న రేంజ్ ఆఫీసర్ ఖాన్

వెలుగోడు: అటవీ జంతువుల కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్టం పరిహారాన్ని వెలుగోడు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎంఏ ఖాన్ పంపిణీ చేశారు. గురువారం స్థానిక అటవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నల్లకాల్వ గ్రామానికి చెందిన కాటీపోగు బాలన్న, కాటీపోగు చిన్న బాలస్వామిలకు పంట నష్టపరిహారం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గోపి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కొండన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేసేందుకే చంద్రబాబు హామీలు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్
- సీఎం వైఎస్ జగనన్న కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- 26వ వార్డులో కార్యకర్తల ఆత్మీయ పలకరింపు



సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్‌కు స్వాగతం పలుకుతున్న కౌన్సిలరు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నందికొట్కూరు: ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు నాయుడు హామీలను గుప్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. గురువారం పట్టణంలోని లింగంవీధి 26వ వార్డులో సాయంత్రం కౌన్సిలరు మందడి వాణి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మంచి జరిగి ఉంటనే ఓటు వేయాలన్నారు. ప్రజలను మోసం చేయడానికే చంద్రబాబు సాధ్యం కాని హామీలను ఇస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగనన్న పాలనలో లంచాలకు, మోసాలకు తావులేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ప్రజల చెంతకే పాలన తెచ్చిన సీఎం వైఎస్ జగనన్నకు ప్రజలు అండగా నిలవాలన్నారు. సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లాలు, రవూఫ్, హమీద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, విద్యార్థి రాష్ట్ర సంఘం నాయకురాలు మాధురి, నాయకులు ఉస్మాన్‌బేగ్, సులోచన, ఉపేంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి, అహమ్మద్, కోకిల రమణారెడ్డి లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కలసికట్టుగా పని చేస్తాం



మాట్లాడుతున్న కుందూరు శివారెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కలసికట్టుగా పని చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు కుందూరు శివారెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ తాను కొద్ది రోజులుగా రాజకీయాలకు దూరంగా ఉన్నానని, అయితే ఎన్నికలు సమీపించడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని గెలిపించుకోవడమే లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలతో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటామని, విభేదాలకు తావులేదన్నారు. పార్టీకి పని చేసిన ప్రతి కార్యకర్తను కలుపుకొనిపోతామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కార్యకర్తలందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, పట్టణ అయ్యద్ సయ్యద్‌మీర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మధ్యంతర భృతి చెల్లించాలి

ఆత్మకూరు : ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి కింద 30 శాతం చెల్లించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఏపీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి సాజిద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు మధ్యంతర భృతి కల్పించాలని, ఇతర అలవెన్స్‌లను చెల్లించాలని కోరారు. అంతకు మునుపు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు.

### 23 నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 23, 24 తేదీల్లో నంద్యాల పట్టణంలోని డాక్టర్ రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో 52వ రాష్ట్ర స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి, సంఘం అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు లీగ్-కమ్-నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెల 16 నుంచి 20వ తేదీ వరకు కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రానగర్ హవేలీలో జాతీయస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### ముగిసిన రాష్ట్రస్థాయి భజన పోటీలు

కొలిమిగుండ్ల: పెట్నికోట ఎస్సీ కాలనీలో సీతారాముల విగ్రహాల ప్రతిష్టను పురస్కరించుకొని బుధవారం రాత్రి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి భజన పోటీలు గురువారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 35 భజన బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి. న్యాయనిర్ణేతలుగా కర్నూలుకు చెందిన రామలింగయ్య, తెలంగాణ నుంచి సోమన్న, రాజబాబు, హైదరాబాదుకు చెందిన సత్తెన్న వ్యవహరించారు. అనంతపురం జిల్లా గుర్రంపాడు, అదే జిల్లా పెద్దవడుగూరుకు చెందిన లక్ష్మంపల్లె, మరూరు, కూచివారిపల్లె భజన బృందాలు వరుసగా నాలుగు స్థానంలో నిలిచారు. వీరికి వరుసగా రూ.30వేలు, రూ.25వేలు,రూ.20 వేలు,రూ.15వేల నగదు బహుమతులు అందించారు. దాతల సహకారంతో 23 బహుమతులను భజన బృందాలకు మొత్తం రూ.2.03లక్షల నగదు బహుమతులు అందజేశారు.

## అలరించిన శ్రీమత్ భాగవత మహత్యం



భాగవతం గురించి వివరిస్తున్న హయగ్రీవాచారి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి, శ్రీశైల దేవస్థానాల వ్యాఖ్యాత డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు శ్రీమత్ భాగవత మహత్యం గురించి భక్తులకు గురువారం వివరించారు. భాగవతంలో శ్రీకృష్ణుడి లీలలు, చిలిపి చేష్టలను కథలు, శ్లోకాల రూపంలో వినిపించారు. దీంతో శ్రీమత్ భాగవత మహత్య ప్రచారాలు ముగిశాయి.

### మార్చి 10లోగా లైసెన్సులు తీసుకోవాలి

పాములపాడు: పాల డెయిరీలో వెన్న శాతం, ఘన పదార్థాల శాతాలను నిర్ధారించేందుకు వినియోగించే మిల్క్ అనలైజర్స్, ఎలక్ట్రానిక్ మిల్క్ టెస్టర్‌లకు మార్చి 10వ తేదీలోగా లైసెన్సులు తీసుకోవాలని పశువైద్యాధికారి, మిల్క్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ సూచించారు. గురువారం మండలంలోని వెంపెంట గ్రామంలోని పశువైద్యశాలలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పాల సేకరణ, విక్రయాల్లో మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు సరైన పాల ధర వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ మిల్క్ ప్రొక్యూర్మెంట్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సేఫ్టీ ఆఫ్ మిల్క్ స్టాండర్డ్స్ యాక్ట్ 2023ను అమలు చేస్తోందన్నారు. ఈ చట్టం ప్రకారం పాల సేకరణ కేంద్రాలు, బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల నిర్వాహకులంతా తాము వాడుతున్న పరికరాలకు విధిగా లైసెన్సులు పొందాలని చెప్పారు. తమ వివరాలను సమీప పశు వైద్య సిబ్బందికి తెలియజేసి నిర్దేశించిన రుసుము చెల్లించి లైసెన్సులు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.. లైసెన్స్ పొందకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### రిజిస్ట్రేషన్లు పూర్తి చేయండి

కొత్తపల్లి: జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ జవహర్‌బాబు గురువారం తెలిపారు. మండలంలో 11 గ్రామ సచివాలయాలకు గాను 918 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను మంజూరు చేసిందని చెప్పారు. వీటిలో 793 మంది లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయడంతో 86.38 శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయ్యిందని వివరించారు. ఇంకా 125 మంది లబ్ధిదారులవి రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉందని, వాటిని కూడా త్వరగా పూర్తిచేయాలని సూచించారు.

### నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల కార్యాచరణ సమితి పిలుపు మేరకు శ్రీశైలం డ్యాం సర్కిల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేని యెడల సమ్మెబాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్జీఓ నాయకులు దాసరి మల్లికార్జున, సి.హెచ్.మధు, నాల్గొవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు డి.రాజేంద్రప్రసాద్, డ్రైవర్స్ అసోషియేషన్ నాయకులు అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

నందికొట్కూరు: పట్టణంలోని బోయపేటకు చెందిన పరమేష్ చెల్లె వివాహానికి శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు కౌన్సిలర్లు మంగళి కృష్ణ, చాంద్‌బాషా, షేక్ నాయబ్ గురువారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ పేదలకు అండగా నిలబడడంలో చాలా సంతోషంగా ఉందన్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చిన తమ శక్తి మేరకు ఆదుకుంటామని చెప్పారు.

### ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

మిడుతూరు: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ హృదయరాజు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని కలమందలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు.

## సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలు



ఖోఖో ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం సీనియర్ ఖో ఖో జట్ల ఎంపిక పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించి క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపారన్నారు. క్రీడల్లో రాణించడం వలన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను తిలకించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, హెచ్‌ఎం మధుసూదన్‌రావు, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్, జిల్లా డీఎస్ఏ కోచ్ భూపతి, వైస్ ప్రెసిడెంట్ పద్మలత, ఫిజికల్ డైరెక్టర్ క్రిష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు డోరాతి, ప్రతాప్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## మహానందిలో నేడు రథసప్తమి వేడుకలు



రథమండపంపై మహాశివుడి చిత్రం

మహానంది: మహానందిలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. ఈ మేరకు వారు గురువారం మాట్లాడుతూ రథసప్తమి వేడుకల్లో భాగంగా రథమండపం వద్ద సూర్యునికి ప్రీతిగా సూర్యనమస్కారాలు, త్రిచ పూజావిధానంలో అర్ఘ్యము, సూర్య యంత్రారాధనలు చేసి రథానికి ప్రత్యేక నివేదనలు సమర్పిస్తామన్నారు. అనంతరం రథమును బయటకు తీసి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కాగా, రథమండపంపై చిత్రీకరించిన మహా శివుడి చిత్రం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నలభై అడుగులకు పైగా ఎత్తున్న రథమండపానికి ఉన్న ద్వారంపై మహాశివుడి చిత్రాన్ని వేయించారు. సుమారు రూ. లక్ష వెచ్చించి చిత్రకారులతో వేయించినట్లు ఈఓ కాపు.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో సంత్ సేవాలాల్ జయంతి



పూజల్లో పాల్గొన్న గిరిజన నాయకులు

వెలుగోడు: పట్టణంలోని జమ్మినగర్ తండాలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జమ్మినగర్ తండాలో భోగ్ బండార్ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. సంత్ సేవాలాల్ శోభా యాత్ర గ్రామ వీధుల గుండా గిరిజన ప్రజల సంసతి సంప్రదాయాలు, నృత్యాలతో శోభాయమానంగా సాగింది. స్థానిక ఆలయంలో గిరిజన పూజారులచే అత్యంత భక్తిశ్రద్ధలతో విశిష్టంగా భోగ్ భండార్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన, భగవత్ తత్వాన్ని పంచిన సంత్ సేవాలాల్ అందరికి మార్గదర్శకుడన్నారు. కార్యక్రమంలో బంజారా ధర్మ రక్ష సమితి రాష్ట్ర నాయకులు నగేష్ నాయక్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భాస్కర్ నాయక్, బద్దే నాయక్, హోంగార్డు రాము నాయక్, నీలా నాయక్, మంగే నాయ తదితరులు పాల్గొన్నారు.

### 'జల్ జీవన్'తో తాగునీటి సమస్యకు పరిష్కారం

వెలుగోడు: గ్రామాల్లో మంచినీటి సమస్యలకు జల జీవన్ పథకం ద్వారా పరిష్కారం చూపుదామని ఎంపీడీఓ సయ్యద్ ఉమర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిసెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి సమస్య ఎక్కడైనా ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలన్నారు. జల జీవన్ పథకం కింద నిధులు విడుదల చేస్తామన్నారు. ఇందు కోసం సర్పంచ్‌తో కలిసి 9 మంది గ్రామస్తులతో జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పక్కీరయ్య, ఏపీఎం సుగణపాల్, పంచాయతీ సెక్రటరీలు సుంకన్న, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో ఆరోగ్యం

నంద్యాల(అర్బన్): పౌష్టికాహారంతో బాలబాలికలు శారీరక, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పీడీ నిర్మల పేర్కొన్నారు. స్థానిక వరల్డ్ విజన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో పౌష్టికాహార లోపం కలిగిన 40 మంది బాలబాలికలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ప్రాజెక్టు ఆఫీసర్ తిరుమలరావు, మదర్ సొసైటీ ఫౌండర్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఇస్తున్న ఆహారంలో ప్రొటీన్లు తప్పనిసరిగా ఉండాలని, ఐదేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వడం వల్ల మానసిక ఎదుగుదలకు తోడ్పతుందన్నారు.

## రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

కర్నూలు (అగ్రికల్చర్): రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయం విస్తరిస్తోందని, ఇందుకు అనుగుణంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ శేఖర్‌బాబు వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయన గురువారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25లో 3.7 శాతం ఎరువుల వినియోగాన్ని తగ్గించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ స్థానంలో పచ్చిరొట్ట ఎరువులు, బయోఫర్టిలైజర్, ఇతర సేంద్రియ ఎరువులను వినియోగించే విధంగా చూడాలని సూచించారు. రైతుల్లోకి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 21న పీఎం కిసాన్ 16వ విడత నిధులు రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదలయ్యే అవకాశం ఉందని, ఆ లోపు పెండింగ్‌లో ఉన్న బ్యాంకు ఖాతాలకు ఈ-కేవైసీ చేయించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు నుంచి జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, బాలవర్ధిరాజు, సునీత, మహమ్మద్ ఖాద్రి, అగ్రానమీ ఏడీఏ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.